క్లుప్తంగా

5న వ్యాసరచన పోటీలు

మెట్టుగడ్డ: సమాజంలో బీసీల పాత్ర అంశంపై ఆగస్టు 5న వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు బీసీ మేధావుల సంఘం కార్యదర్శి ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులు పోటీలో పాల్గొనాలని, గెలుపొందిన వారికి బహుమతులతోపాటు సర్టిఫికెట్స్ అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీదేవి, రాములు, శ్యాం, అనిత పాల్గొన్నారు.

తిరుమలలో కూచిపూడి నృత్య ప్రదర్శన



చిన్నచింతకుంట: మండలంలోని గూడూరుకు చెందిన కళాకారుణి షణ్ముకప్రియ ఆదివారం తిరుమల దేవస్థానం ఆడిటోరియంలో నిర్వహించిన కూచిపూడి కళా ప్రదర్శనలో పాల్గొంది. అభినయ ఆర్ట్స్ హనుమాన్ అవార్డ్స్ 25వ వార్షికోత్సవం సందర్భంగా టీటీడీ సౌజన్యంతో మహతి ఆడిటోరియం వారు నిర్వహించిన ప్రదర్శనకు షణ్ముకప్రియతోపాటు ఎంతోమంది కళాకారులు హాజరుకాగా.. షణ్ముక ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. తిరుపతిలో కూచిపూడి ప్రదర్శన ఇవ్వడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు పలువురు అభినందించారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలి

హన్వాడ: ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌యాదవ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ గార్డెన్స్‌లో నిర్వహించిన కర్వెన పాఠశాల హెచ్‌ఎం శివశంకర్ పదవీ విరమణ కార్యక్రమానికి హాజరై శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంఓ శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, నారాయణగౌడ్, ఎంఈఓలు ఉషారాణి, కృష్ణారెడ్డి, గోపాల్‌నాయక్, అనంతప్ప, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఫింగర్ ప్రింట్‌తో అనుమానితుల గుర్తింపు



రాజాపూర్: గతంలో దొంగతనాలకు పాల్పడి చట్టానికి దొరక్కుండా తిరుగుతున్న వ్యక్తులను ఆదివారం మండలంలోని ముదిరెడ్డిపల్లి క్రాస్ రోడ్డులో ఎస్‌ఐ శివానందంగౌడ్ ఫింగర్ ప్రింట్ డివైస్‌తో సెర్చ్ చేశారు. సమీప సెజ్‌లో బీహార్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి పరిశ్రమల్లో పనిచేస్తున్న వ్యక్తుల ఫింగర్ ప్రింట్‌లను తీసుకున్నట్లు తెలిపారు. నాన్‌బెయిలబుల్ వారెంట్‌లు సైతం పెండింగ్‌లో ఉన్న ఈ ఫింగర్ ప్రింట్ డివైస్‌తో గుర్తించవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో అనుమానితులు తిరిగినా పోలీసులకు తెలియజేయాలని మండల ప్రజలకు సూచించారు.

నేడు కలెక్టరేట్ వరకు కాలినడక

మహబూబ్‌నగర్ న్యూటౌన్: దివిటిపల్లి డబుల్ బెడ్రూం కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వరకు కాలినడకన చేరుకొని ధర్నా నిర్వహించనున్నట్లు పట్టణ కార్యదర్శి చంద్రకాంత్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కాలనీలో ఎత్తు ప్రాంతాలకు మిషన్ భగీరథ నీరు రావడంలేదని, వర్షాల కారణంగా రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని ఆరోపించారు.

జాంద్ర సంఘం నగర కమిటీ ఎన్నిక

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జాంద్ర సంఘం నగర కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాలరాజు, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, కోశాధికారిగా అనిల్‌కుమార్‌తోపాటు యువజన సంఘం అధ్యక్షుడిగా సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా విశ్వకాంత్, కోశాధికారిగా నవీన్, మహిళా సంఘం అధ్యక్షురాలిగా ప్రసన్నలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా అనిత, కోశాధికారిగా వరలక్ష్మి ఎన్నికయ్యారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధికంగా జాంద్రులు పోటీ చేసి గెలిపించుకునేందుకు కృషిచేద్దామన్నారు.

బాధితుడికి పరామర్శ

హన్వాడ: ప్రమాదంలో ఉన్న కార్యకర్తలు అధైర్యపడొద్దని.. అండగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మండలకేంద్రానికి చెందిన తాపీమేస్త్రీ బైకని యాదయ్య ప్రమాదవశాత్తు కిందపడి గాయపడి నేహాషైన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతు న్నాడు. విషయం తెలుసుకున్న సురేందర్‌రెడ్డి ఆస్పత్రికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు. ఆయనవెంట ప్రముఖ న్యాయవాది కృష్ణ, నాయకులు బైకని రాములు, దస్తయ్య, వెంకటయ్య, శ్రీను, తదితరులు ఉన్నారు.

లక్ష్యం.. నిర్లక్ష్యం

- ముందుకుసాగని ఎన్‌ఆర్‌ఈజీఎస్ మొక్కల పంపిణీ
- నర్సరీల్లో దర్శనమిస్తున్న విత్తనాలు నాటని ఖాళీ బెడ్లు
- నర్సరీల ద్వారా రైతులకు అందని ఉపయోగపడే మొక్కలు
- ఇళ్లల్లో నాటుకునే మొక్కలపై శ్రద్ధచూపని ప్రజలు



మొకర్లాబాద్ నర్సరీలో పంపిణీ చేయని మొక్కలు

మహమ్మదాబాద్: మొక్కలు నాటి వాటిని పెంచి పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతీ గ్రామంలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టింది. కానీ అధికారులు, నిర్వాహకుల నిర్లక్ష్యంతో పెంచిన మొక్కలు పంపిణీ చేయలేక పంపిణీ చేసిన మొక్కలను బతికించుకోలేక నిర్లక్ష్యం వహిస్తున్నట్టుంది. ఉమ్మడి గండీడ్, మహమ్మదాబాద్ మండలాల్లో 49 పంచాయతీల్లో 49 నర్సరీల్లో 5.30లక్షల మొక్కలు పెంచేందుకు లక్ష్యం పెట్టుకున్నారు. దీంట్లో 3.41లక్షలు ఫీల్డ్‌పై నాటేందుకు నిర్ణయించగా.. ఇళ్లల్లో 94వేల మొక్కలు నాటేందుకు పంపిణీకి నిర్ణయించారు. మొత్తం 49 నర్సరీల్లో కలిపి పాతవి కొత్త మొక్కలు 6లక్షలపైచిలుకు ఉన్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు.

మొక్కల పంపిణీలో చేరుకోని లక్ష్యం

ఉమ్మడి మండల వ్యాప్తంగా మొత్తం 3.41లక్షలు మొక్కలు పంచాల్సి ఉండగా కేవలం 1.9లక్షలు మాత్రమే పంపిణీ చేశారు. గ్రామాల్లో ఇళ్లల్లో 94 వేలు పంపిణీ చేయాల్సి ఉండగా 65వేల మొక్క లు మాత్రమే పంపిణీ చేసి చేతులు దులుపుకొన్నారు. వర్షాకాలం ప్రారంభమై రెండునెలలు గడుస్తున్నా.. ఇప్పటికీ పూర్తిస్థాయిలో మొక్కలు పంపిణీ చేయడంలో అధికారులు విఫలమయ్యారనే చెబుతున్నారు. ప్రతి గ్రామంలోని నర్సరీలో 10వేల మొక్కలు పెంచాల్సి ఉండగా కొన్ని గ్రామాల్లోని నర్సరీల్లో మాత్రం పెంచిన మొక్కలు పంచలేదు. మరికొన్ని గ్రామాల్లో 10వేల మొక్కలు పెంచలేదు. కొన్ని నర్సరీల్లో చిన్న మొక్కలు పెంచాలని బెడ్లల్లో మట్టినింపారు కాని విత్తనాలు వేయడం మరిచిపోయారు.

నాటాల్సిన స్థలాల్లో బతకలేదు

నర్సరీల్లోని పెంచిన మొక్కలు ప్రభుత్వ స్థలాల్లో, అటవీ భూముల్లో, కొండలు గుట్టలు ప్రాంతాల్లో, రోడ్ల వెంబడి మొక్కలు నాటాల్సి ఉన్నది. ఏటా నాటినచోటే మొక్కలు నాటడం వాటిని బతికించుకోకపోవడం వంటి నిర్లక్ష్యం జరుగుతున్నది. రైతులకు పనికొచ్చే టేకు మొక్కలను పంపిణీ చేయడంలేదని రైతులు పేర్కొంటున్నారు. ఇళ్లముందు నాటాల్సిన మొక్కలపై మహిళలు శ్రద్ధ చూపకపోవడంతో నర్సరీల్లో పెంచిన తులసి, పూల మొక్కలు నర్సరీల నుంచి తీసేస్తున్నారు.

రైతులకు ఉపయోగం లేదు

గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా పెంచిన మొక్కలతో రైతులకు ఎలాంటి ఉపయోగం లేదు. ఎప్పటిలాగా టేకు, మామిడి, నేరేడు, జామవంటి మొక్కలు పంపిణీ చేస్తే నీటి ఆధారం ఉన్నవారు పంటపొలాల వద్ద మరికొందరు ఇళ్లదగ్గర పెంచుకునే అవకాశం ఉన్నది.

– అనంతయ్య వెంకట్‌రెడ్డిపల్లి

త్వరలో మొక్కల పంపిణీ

నర్సరీల్లో పెంచిన మొక్కలు ఇచ్చిన టార్గెట్ ప్రకారం పంపిణీ చేస్తున్నాం. ఇప్పటికీ 50శాతంకుపైగా పంపిణీ చేశాం. మిగతావి వారం రోజుల్లో పంపిణీ చేయిస్తాం. రైతులకు సంబంధించిన మొక్కలు నర్సరీల్లో పెంచలేదు. అధికారుల సూచన మేరకు మొక్కలను పెంచుతున్నాం.

– హరిచ్చంద్రుడు, ఏపీఓ, ఉమ్మడి గండీడ్

అటెన్షన్ ప్లీజ్

మడుగును తలపించేలా..!



చిన్నవార్వాల్ పాఠశాల ఎదుట నిలిచిన వర్షం నీరు

గండీడ్: మండలంలోని చిన్నవార్వాల్ ప్రాథమిక పాఠశాలలో ఒకటో నుంచి ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. 77మంది విద్యార్థులు, ఐదు గురు ఉపాధ్యాయులు. పాఠశాలలో మూడు గదులు ఉన్నాయి. ఒక గది స్టాఫ్‌రూం కాగా మిగతా రెండు గదులు, వరండాలో తరగతులు కొనసాగుతున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే విద్యార్థులకు తంటాలు తప్పడంలేదు. పాఠశాల ఎదుట ఎక్కువ మొత్తంలో వర్షపు నీరు నిలిచి మడుగును తలపిస్తోంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు తరగతుల్లోకి వెళ్లాలంటే వర్షపునీటిలోంచే రావాలి. అంతేకాక పాఠశాల సమయంలో వర్షం పడితే వరండాల్లోని తరగతులు కూడా నిర్వహించడం కష్టమే. ఏళ్లుగా సమస్యతో విద్యార్థులు సతమతమవుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పరిస్థితుల్లో మార్పులేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అదనపు గదులు నిర్మించి పాఠశాల ఎదుట వర్షపు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

పెద్దగుట్టకు శ్రావణశోభ



గుట్టపై అఖండ భజనలో పాల్గొన్న రామభక్త భజన బృందం సభ్యులు



జడ్చర్ల టౌన్: బాదేపల్లి పెద్దగుట్టపై కొలువైన లక్ష్మీ సమేత రంగనాథస్వామి ఆలయానికి శ్రావణశోభ సంతరించుకొంది. ఆదివారం సెలవుదినం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో గుట్టపైకి చేరుకుని స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు పాతబజారు రామభక్త భజన బృందం ఆధ్వర్యంలో అఖండ భజన చేశారు. ఆదివారం గుట్టపై పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం జరిపించారు. శ్రావణమాసం ప్రారంభ రోజు నుంచి ముగిసే వరకు ప్రతిరోజు ఒక దంపతులకు పట్టువస్త్రాలు అందించనున్నట్లు పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాల్వరాంరెడ్డి తెలిపారు. ప్రతి ఆదివారం పట్టువస్త్రాల పంపిణీ ఉంటుందన్నారు.

శ్రావణపూజలకు ప్రత్యేక ఏర్పాట్లు

నవాబుపేట: మండలంలోని లోకిరేవులో వెలిసిన ఏకశిలా రూపుడిగా పేరొందిన వీరభద్రస్వామికి శ్రావణపూజల కోసం ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆరడుగుల ఎత్తులో ఏకశిలతో ఏర్పాటైన వీరభద్రుడు భద్రకాళి సమేతంగా ఆలయంలో దర్శనం ఇవ్వడం ఇక్కడ ప్రత్యేకం. వీరభద్రుడు తలపై శివలింగాన్ని ధరించి ఉండడంతో ఇక్కడ రుద్రాభిషేకాలు చేస్తే నేరుగా శివుడి జన్మస్థలంలో చేసినట్లు అని భక్తుల నమ్మకం. ప్రతి శ్రావణ సోమవారం రుద్రాభిషేకాలు, సామూహిక వ్రతాలు నిర్వహించి చివరి సోమవారం లక్షపుష్పార్చన; లక్షబిల్వార్చన గావిస్తారు. ఆలయానికి తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున చేరుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటారని, ఉత్సవాలకు ఆలయం ముస్తాబు చేసి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ పూజారి లింగయ్య గురుస్వామి, నందీశ్వర గురుస్వామి తెలిపారు.

నివాసాల మధ్య నిలుస్తున్న వర్షపునీరు



కొత్త బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్‌లోకి వచ్చిన వర్షం నీరు



కోయిల్‌సాగర్ రోడ్‌లోని నివాస ప్రాంతాల మధ్య నిలిచిన వర్షం నీరు

దేవరకద్ర: దేవరకద్ర మున్సిపాలిటీలోని నివాస ప్రాంతాలన్నీ జలమయమవుతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో భారీ వర్షాల కారణంగా రాయిచూర్‌రోడ్, కోయిల్‌సాగర్ రోడ్, గూరకొండ రోడ్‌తోపాటు కొత్త బస్టాండ్ పరిసర ప్రాంతాలన్నీ వర్షపు నీరు నిలిచి కుంటలను తలపిస్తున్నాయి. కొత్తబస్టాండ్ ప్రాంతంలో దాదాపు పదిహేనేళ్ల క్రితం డ్రైనేజీలను నిర్మించినప్పటికీ సాంకేతికంగా ఎత్తు నుంచి కిందకు వెళ్లే విధంగా లేకపోవడంతో నీరంతా నివాసాల మధ్యకు వస్తున్నది. ఇక డ్రైనేజీ కొన్నిచోట్ల పూడుకుపోవడంతో కూడా నీరు ప్రవహించక బయటకు వస్తున్నది. దీనివల్ల నివాసాల మధ్య తటాకాలుగా తలపిస్తున్నాయి. డ్రైనేజీలు కూడా చిన్నగా ఉండడంతో సమస్య తలెత్తుతున్నది.

షాపుల్లోకి వస్తున్న నీరు

దేవరకద్ర కొత్త బస్టాండ్ సమీపంలోని షాపుల్లోకి వర్షం నీరు ప్రవహిస్తున్నది. ఈ ప్రాంతంలో ఉన్న హోటళ్లు, ఇతర వ్యాపార కేంద్రాల్లోకి వర్షం నీరు చేరుతున్నది. డ్రైనేజీలు నిండిపోవడం వల్లనే షాపులు జలమయం అవుతున్నాయని వ్యాపారులు వాపోతున్నారు. దేవరకద్ర మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడం వల్లనే వర్షపు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నది. మున్సిపాలిటీగా మారిన దేవరకద్రలో కొత్తగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తే పట్టణం పరిశుభ్రంగా మారే అవకాశం ఉంది.

అ'పూర్వ' కలయిక



వేములలో కలుసుకున్న 1993-94వ బ్యాచ్ విద్యార్థులు

అడ్డాకుల: మూసాపేట మండలం వేముల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1993–94వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలలో కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఒకరినొకరి యోగక్షేమాలను తెలుసుకున్నారు. నాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు కొండారెడ్డి, వహీద్, యాసిన్, సంజీవరెడ్డిని పాఠశాలకు ఆహ్వానించి శాలువా, పూలమాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశా రు. పాఠశాల అభ్యున్నతికి కృషి చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆనంద్‌రెడ్డి, కృష్ణయ్య, వెంకట్రాంరెడ్డి, సుదర్శన్, రమేశ్‌రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, రవికాంత్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ కార్మికులను ఆదుకోవాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులకు సీఎం రేవంత్‌రెడ్డి అండగా నిలిచి ఆదుకోవాలని ఆల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తమ సొసైటీ తరపున సీఎం కార్యాలయానికి మెయిల్ ద్వారా విజ్ఞాపనపత్రం పంపించినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల 2017 పీఆర్‌సీ బకాయిలు, 2021 పీఆర్‌సీ అమలు, 8 గంటల పనివిధానం, కా రుణ్య నియామకాల కింద పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయా లని విజ్ఞప్తి చేశారు. సీఎం ప్రకటన కోసం వేలాది ఆర్టీసీ కుటుంబాలు ఎదురుచూస్తున్నాయని తెలిపారు.

కుల సమాజం అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మెట్టుగడ్డ: సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందిన వీరశైవ లింగాయత్ లింగ బలిజ సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని లింగ బలిజ నాయకుడు, జేపీఎన్‌సీఈ చైర్మన్ కేఎస్ రవికుమార్ అన్నారు. ఆదివారం బోయపల్లి రోడ్డులోని తువ్వగుట్ట పైనున్న బసవభవన్‌లో వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బలిజ కులస్తుల ఐక్యతతో విశాలమైన బసవభవన్ నిర్మాణం చేసుకున్నామని, లింగ బలిజ కులాన్ని ఓబీసీ జాబితాలో చేర్చే వరకు సంఘటితమై పోరాడాలని పిలుపునిచ్చారు. బసవభవన్ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వజ్రలింగం, పోకల శివుడు, వీరేశలింగం, శెట్టి చంద్రశేఖర్, రాజసింహుడు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ నూతన కమిటీ ఎన్నిక

పట్టణ వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా వజ్రలింగం, అధ్యక్షుడిగా పోకల మల్లేశ్, ప్రధాన కార్యదర్శిగా శంకర్‌లింగం, కోశాధికారి విజయ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

సీసీరోడ్డుపై ప్రమాదకరంగా గుంత!



అడ్డాకుల: మండలంలోని చిన్నమునుగల్‌చేడ్ నుంచి పెద్దమునుగల్‌చేడ్‌కు వెళ్లే దారిలో సీసీరోడ్డుపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. ఇక్కడ సీసీరోడ్డు కింద మురుగు కాల్వ వెళ్లేందుకు ఏర్పాట్లు చేయగా.. దానిపై గుంత ఏర్పడి అందులో ఇనుప చువ్వలు కనిపిస్తున్నాయి. దీనివల్ల వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. రాత్రివేళ గుంత కనిపించక ఆటోలు, ద్విచక్ర వాహనదారులు అందులో పడిపోయే ప్రమాదం లేకపోలేదు. రోడ్డుపై వెళ్లే మూగజీవాలు అందులో కాలు పెడితే ఇరుక్కుపోయే అవకాశం ఉంది. అధికారులు స్పందించి గుంతను పూడ్చి వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తరగతి గదిలోనే చిన్నారుల భవిష్యత్



మాట్లాడుతున్న ధర్మజాగరణ సమితి సంయోజక్

జడ్చర్ల టౌన్: తరగతి గదిలోనే చిన్నారుల భవిష్యత్ నిర్మితమవుతుందని ధర్మజాగరణ విభాగ సంయోజక్ లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సరస్వతి శిశుమందిరంలో రెండు రోజులుగా ఉపాధ్యాయులకు కొనసాగుతున్న శిక్షణ ఆదివారం ముగిసింది. ముగింపు సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల సర్వాంగీన వికాసం భారతీయ విద్యలో కనిపిస్తుందని, అట్టి భారతీయ విద్య విద్యాభారతి అఖిల భారతీయ విద్యాసంస్థ అందిపుచ్చుకొని సరస్వతి శిశుమందిరాలు నెలకొల్పి చిన్నారులకు చక్కటి సంస్కారంతో కూడిన విద్యను అందిస్తున్నాయన్నారు. శిశుమందిరాల్లో ఎక్కువగా మాతాజీలు (మహిళలు) విధులు నిర్వహిస్తున్నారన్నారు. రెండురోజుల శిక్షణను సద్వినియోగం చేసుకుని విద్యార్థులను మరింత ఉన్నతులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. శిక్షణకు ఉమ్మడి జిల్లాలోని 29 సరస్వతి శిశుమందిరాలనుంచి 150మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి శ్రీకాంత్, జగ్‌పాల్‌రెడ్డి, సలహాదారు విఠలయ్య, అధ్యక్షురాలు పద్మలీల, ప్రధానాచార్యులు వెంకటయ్య పాల్గొన్నారు.

కలాం ఆశయ సాధనకు కృషి చేద్దాం



ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయ సాధనకు కృషి చేద్దామని మిల్లీ మహాజ్ మహబూబ్‌నగర్ కన్వీనర్ తఖీ హుస్సేన్ అన్నారు. న్యూటౌన్‌లో ఆదివారం అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తఖీ హుస్సేన్ మాట్లాడుతూ కలాం జీవితం యువతకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో మిల్లీ మహాజ్ చీఫ్ ప్యాట్రన్ ఖాజా ఫయాజుద్దీన్ అన్వర్‌పాషా, మిర్జా ఖుద్దూస్ బేగ్, తయ్యబ్ బాష్వార్, అబ్దుల్లా సున్నీ, మహ్మద్ మొయిజ్, మహ్మద్ నూరుల్లాఖాన్, మహ్మద్ బషీర్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాంకు ఘననివాళి

జడ్చర్ల టౌన్: మాజీ రాష్ట్రపతి, దివంగత అబ్దుల్ కలాం వర్ధంతిని ఆదివారం స్థానిక ఎమ్మార్సీ వద్ద ఫకీర్ల సంక్షేమ సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు జహంగీర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలాం దేశ గౌరవాన్ని ప్రపంచవ్యాప్తం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో రాములు, రాజు, రాఘవేందర్, చౌదరి, యాదవ్, రమేశ్ పాల్గొన్నారు.

కలాం కలలను సాకారం చేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: అబ్దుల్ కలాం కలలను సాకారం చేయాలని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సద్దల్‌గుండు ప్రాంతంలో కలాం డ్రీం ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌లో అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంఓ శ్రీనివాస్, సీఎంఓ బాలుయాదవ్, ల్యాబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీధర్, చక్రవర్తి, యుగంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సమితి వనమహోత్సవం



గండీడ్: మండలంలోని సత్యసాయి సేవా సమితి సభ్యులు ఆదివారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వెన్నాచేడ్‌లో జిల్లా కోఆర్డినేటర్ శివమల్లప్ప, వెన్నాచేడ్ సేవాసమితి కన్వీనర్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బందితో కలిసి గ్రా మంలో పలుచోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి సభ్యులు రాములు, బాలయ్య, చంద్రయ్య, బిచ్చన్న, నరేందర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీని సమిష్టిగా అభివృద్ధి చేసుకుందాం

జడ్చర్ల టౌన్: సమిష్టిగా మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకుందామని మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కాంగ్రెస్ పార్టీ వార్డు కౌన్సిలర్లు, పట్టణ నాయకులు నిర్ణయించారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎ మ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సూచనలతో నిర్వహించి న సమావేశంలో పలు అంశాలపై చర్చించా రు. పార్టీలోకి నూతనంగా వచ్చినందున చైర్‌పర్సన్ పార్టీ నాయకులతో పరిచయం చేసుకున్నారు. పార్టీలో చేరాక తమకు సమాచారం ఇవ్వకుండా వార్డుల్లో పర్యటించడం తగదని కొందరు నాయకులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఇకపై ముందుగా పార్టీలో ముఖ్య నాయకులకు తెలియజేయాలని, వారు మిగిలిన వారికి సమచారం ఇచ్చుకుంటారని నిర్ణయించారు. పార్టీలో సీనియర్లు, ముఖ్యులను కలుపుకొని వెళ్లి మున్సిపాలిటీని అన్నివిధాలుగా అభివృద్ధి చేసుకుందామని నిర్ణయించారు. సమావేశంలో కౌన్సిలర్ కుమ్మరిరాజు, నాయకులు వెంకటేశ్, రవిశంకర్, మినాజ్ పాల్గొన్నారు.

'కృష్ణ విగ్రహం ఏర్పాటుపై మధ్యంతర ఉత్తర్వులు'

మెట్టుగడ్డ: జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా సినీ హీరో కృష్ణ విగ్రహాన్ని ఏర్పాటు చేశారంటూ హైకోర్టును ఆశ్రయించగా.. కేసు విచారణ అనంతరం హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినట్లు నేనుసైతం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని నేనుసైతం కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. నేనుసైతం పోరాటంతోనే గతంలో నగర కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి కృష్ణ విగ్రహాన్ని ఏర్పాటు చేయొద్దని లిఖితపూర్వక నోటీసు జారీచేయగా.. కృష్ణ అభిమానులు నోటీసును ధిక్కరించి నిబంధనలకు విరుద్ధంగా మే 31న విగ్రహాన్ని ఆవిష్కరించారని పేర్కొన్నారు. ఈ విషయమై కలెక్టర్, నగర కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లే క హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. నగ ర కమిషనర్ విచారణ జరిపి నివేదిక సమర్పించాలని, ఫ్యాన్స్ అధ్యక్షుడికి వ్యక్తిగతంగా నోటీ సు జారీ చేయాలని, ఇరువురి వాదనలు విని చట్టప్రకారం ఆదేశాలు జారీ చేస్తామని, కేసును ఆగస్టు 14కు వాయిదా వేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని తెలియజేశారు.

రెస్టారెంట్ ప్రారంభం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని భూత్పూర్ రోడ్డుపై బైపాస్ సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన కొనగంటి గ్రాండ్ ఇన్ రెస్టారెంట్, బాంక్వెట్ హాల్‌ను ఆదివారం దేవరకద్ర ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మహబూబ్‌నగర్‌లో అందరి అభిరుచికి తగినట్లుగా రెస్టారెంట్‌ను ఏర్పాటు చేయడం బాగుందన్నారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎన్‌పీ వెంకటేశ్, అమరేందర్‌రాజు, పాలమూరు రెడ్డి సేవా సమితి నాయకులు ఇంద్రసేనారెడ్డి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.